క్లుప్తంగా

టీఎస్ఎస్ఓ కార్యవర్గ సభ్యుడిగా వంశీ

తలకొండపల్లి: టీఎస్ఎస్ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా మీసాల వంశీ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్ చేతులమీదుగా వంశీ శనివారం నియామకపత్రాన్ని అందుకున్నారు. మండల పరిధిలోని జంగారెడ్డిపల్లికి చెందిన వంశీ టీఎస్ఎస్ఓ ఆధ్వర్యంలో విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని.. ఆయన సేవలను గుర్తించి వంశీని రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎంపిక చేసినట్లు లక్ష్మీనివాస్ పేర్కొన్నారు. అనంతరం వంశీ మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి నాకు ఈ పదవి కట్టబెట్టిన రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, ఆర్గనైజేషన్ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా 'సీవీఆర్' వార్షికోత్సవం



విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న నారాయణరెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ఆదిబట్ల మున్సిపాలిటీలోని మంగళపల్లిలో గల సీవీఆర్ ఇంజనీరింగ్ కళాశాల 22వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆటలపోటీలు నిర్వహించారు. వివిధ పోటీల్లో నెగ్గిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కాసా రామ్మోహన్‌రెడ్డి, వైస్‌ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్కం శివారెడ్డి, డీన్ అకాడమిక్స్ డాక్టర్ కేఎస్.నయనతార, డీన్ ప్లానింగ్ అండ్ కోఆర్డినేషన్ డాక్టర్ ఎంవీ శేషగిరిరావు, కళాశాల మేనేజర్ ఎస్‌నారయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ఐక్యతా ఫౌండేషన్



పూజలు నిర్వహిస్తున్న ఐక్యతా ఫౌండేషన్ సభ్యులు

తలకొండపల్లి: మండల పరిధిలోని వెల్జాల్ వేదాద్రి శ్రీ లక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నల్లబోలు శ్రీధర్‌రెడ్డి సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహించారు. ఐక్యతా ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు సుంకిరెడ్డి కృష్ణారెడ్డి దంపతులు, ఎగ్జిక్యూటివ్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయాభివృద్ధికి తమవంతు సహాయం అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు రాఘవేందర్, శివ, విజయ్, మల్లేశ్, భరత్, భక్తులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో యువతకు పెద్దపీట

మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాష

మంచాల: బీఆర్ఎస్ పార్టీతోనే యువతకు భవిష్యత్ అని ఆ పార్టీ నేత నాయకుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ జానీపాష అన్నారు. శనివారం మంచాల మండల పరిధిలోని తిప్పాయిగూడ గ్రామంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో యువజన విభాగం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి పథంలో ముందుకుపోతుందన్నారు. కష్టపడి పనిచేసేవారికి తగిన గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్, మండల ప్రధాన కార్యదర్శి విజయ్, నాయకులు వీరేశ్ గౌడ్, చిరంజీవి, యాదగిరి, శివ, సాయి పాల్గొన్నారు.

గ్రామాల్లో మహనీయుల జాతర నిర్వహిద్దాం

ఇబ్రహీంపట్నం: ప్రతి గ్రామంలో మహనీయుల జాతర నిర్వహించాలని ప్రొఫెసర్ సుదర్శన్, ప్రముఖ కవి, గాయకుడు మచ్చ దేవేందర్, కేవీపీఎస్ నాయకుడు కె.భాస్కర్ అన్నారు. మహాత్మా పూలే, అంబేడ్కర్ జన జాతర సభను శుక్రవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలో కులం, మతం పేరుతో పాలకులు పాలన చేస్తున్నట్లు ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌కారత్, జాతర కన్వీనర్ నరసింహ, పాటల రచయిత, గాయకుడు సత్తన్న, వృత్తి సంఘాల నాయకులు నాయకులు పాల్గొన్నారు.

కందుకూరు పీహెచ్‌సీ తనిఖీ

కందుకూరు: కందుకూరు పీహెచ్‌సీని శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ గీత తనిఖీ చేశారు. మందులు సరిపడా ఉన్నాయా లేదా అని సిబ్బందిని అడిగితెలుసుకున్నారు. అనంతరం అక్కడ కొనసాగుతున్న ఆశ వర్కర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలను అందించాలన్నారు. రికార్డులను పక్కాగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ రవీందర్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించని సమావేశాలెందుకు?

- అధికారుల తీరుపై సర్వసభ్య సమావేశంలో సభ్యుల ఫైర్
- హాజరైన ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి
- సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం



సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ రాములు

కడ్తాల్: గత సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాలే అమలు కానప్పుడు మరలా సమావేశాలు నిర్వహించడం ఎందుకని వైస్ ఎంపీపీ ఆనంద్, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరామ్‌నాయక్, రాములుగౌడ్, మండల కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబా ఆగ్రహం వ్యక్తం చేశారు. కడ్తాల్ మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సర్వసభ్య సమావేశం ప్రారంభించి వివిధ శాఖల వారీగా సమీక్ష జరుపుతుండగా గత సర్వసభ్య సమావేశంలో చేసిన తీర్మానాల సంగతేంటని పలువురు ఎంపీటీసీ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మండల సర్వసభ్య సమావేశంలో చేస్తున్న తీర్మానాలపై ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించి త్వరితగతిన సమస్యలు పరిష్కారమయ్యేలా చూడాలని ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, రాములుగౌడ్, ఉమావతి, జహంగీర్ బాబా, సర్పంచ్‌లు యాదయ్య, సుగుణ కోరారు. పంట నష్టపోయిన ప్రతి ఎకరాకు ప్రభుత్వం రూ.10 వేలు అందిస్తుందని.. అధికారులు పంటనష్టం వివరాల నివేదికలను ప్రభుత్వానికి అందించాలని ఎంపీ, ఎమ్మెల్సీ సూచించారు. గత నాలుగైదు ఎళ్లగా వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు నేటికీ పరిహారం అందలేదని సర్పంచ్ సుగుణ సభ దృష్టికి తేగా.. తాము ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్లు ఏఓ శ్రీలత తెలిపారు.

రహదారుల వెడల్పు పట్టదా..

రావిచేడ్–మద్దెలకుంట రహదారి పనులు నాలుగు సంవత్సరాల క్రితం ప్రారంభించినా నేటికీ పూర్తికాలేదని జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ సభ దృష్టికి తేగా.. వెంటనే పనులు పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని పీఆర్ డీఈ తిరుపతిరెడ్డి, ఏఈ పరమేశ్‌ను ఎంపీ రాములు ఆదేశించారు. అదేవిధంగా కడ్తాల్–గుర్లకుంట రహదారిని వెడల్పు చేయాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి అధికారులకు సూచించారు. మద్దెలకుంటతండా, రావిచేడ్ గ్రామాల్లో మిషన్‌భగీరథ నీరు సక్రమంగా సరఫరా కావడం లేదని ఎంపీటీసీ గోపాల్ సభ దృష్టికి తేగా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి ఆయా శాఖల ఏఈలను ఆదేశించారు. మండల కేంద్రంలో వెలసిన ఓ వెంచర్‌లో గ్రామ పంచాయతీకి కేటాయించిన 10 శాతం భూములు సంబంధిత వెంచర్ నిర్వాహకులు గ్రామ పంచాయతీకి అప్పగించడం లేదని వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ హరిచంద్‌నాయక్, ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యుడు జహంగీర్‌బాబాసభ దృష్టికి తేగా.. మండలంలో ఎన్ని వెంచర్లు ఏర్పాటు చేశారు..10 శాతం క్రింద గ్రామ పంచాయతీలకు ఎంత భూమి కేటాయించారో పూర్తి వివరాలతో సమగ్ర నివేదికను తయారు చేసి ఇవ్వాలని ఎంపీఓ మధుసూధనచారికి ఎంపీ రాములు సూచించారు.

ఎఫ్‌టీఎల్ పరిధి అన్యాక్రాంతం..

పెద్దకుంట, కుమ్మరికుంట, దేవర చెరువుల్లో ఎఫ్‌టీఎల్, శిఖం భూములు అన్యాక్రాంతమవుతున్నాయని, ఎఫ్‌టీఎల్ భూమిలో మట్టిని నింపి.. ప్లాట్లుగా చేస్తున్నారని పాటు కాల్వలను ధ్వంసం చేసి చెరువుల, కుంటల ఉనికికే ప్రమాదం తెస్తున్నారని వైస్ ఎంపీపీ ఆనంద్ ససభలో ప్రస్తావించగా.. ఇప్పటికే ఈ విషయమై ఉన్నతాధికారులకు పిర్యాధు చేశామని సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఏఈ నిఖిల పేర్కొన్నారు. మండల పరిషత్ నిధుల కేటాయింపు వివరాలు అందరు సభ్యులకు ఎందుకు తెలపడం లేదన.. అందరికీ సమానంగా నిధులు కేటాయించాలని సభ్యులు ఆనంద్, గోపాల్, లచ్చిరామ్‌నాయక్ సభ దృష్టికి తేగా అందరి సభ్యులకు సమానంగా నిధులు కేటాయించాలని ఎంపీ రాములు ఎంపీడీఓను ఆదేశించారు. మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న తీరుపట్ల ఎంపీడీఓపై ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామ పంచాయతీలకు రావాల్సిన బిల్లులు నెలల తరబడి రావడం లేదని సర్పంచ్‌లు శంకర్, సుగుణ, యాదయ్య, లోకేశ్, హరిచంద్‌నాయక్ తెలుపగా.. నెలరోజుల్లో రూ.కోటిలోపు బకాయిలను గ్రామ పంచాయతీలకు చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఎంపీ రాములు పేర్కొన్నారు. ప్రభుత్వం లక్షలోపు రుణమాఫీ చేయకపోవడంతో బ్యాంకర్లు కొత్త రుణాలు ఇవ్వడం లేదని జహంగీర్‌బాబా తెలపగా త్వరలోనే రైతుల ఖాతాల్లో రుణమాఫీ జమచేయడం జరుగుతుందని ఎంపీ, ఎమ్మెల్సీ తెలిపారు.

ఇళ్ల స్థలాలు కేటాయించండి..

మండల విలేకరులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఎంపీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరామ్‌నాయక్ కోరగా అనువైన స్థలాలు గుర్తించి , కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపించాలని ఎంపీ రాములు.. తహసీల్దార్ మురళీకృష్ణను ఆదేశించారు. ఎంపీడీఓ కార్యాలయం అద్దెభవనంలో నిర్వహిస్తుండం పట్ల ఎంపీ విస్మయం వ్యక్తం చేశారు. వెంటనే కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడి మండల కేంద్రంలో మండల పరిషత్ కార్యాలయానికి సొంత భవనం నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సందర్భంగా ఎంపీ, ఎమ్మెల్సీ మాట్లాడుతూ.. అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో మండల అభివృద్ధికి ముందుకు సాగాలని సూచించారు. హైదరాబాద్‌లో 125 అడుగుల ఎత్తైన అంబేడ్కర్ విగ్రహం, అదే విధంగా నూతన సచివాలయం నిర్మాణం చేయడం పట్ల సభ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ తీర్మానం చేసింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీకృష్ణ, జెడ్పీటీసీ దశరథ్ నాయక్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంఈఓ సర్దార్, వివిధ శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ఉన్నారు.

నిరుపేదలకు ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండల పరిధిలోని దేవునిపడకల్, వెంకటాపూర్, రాంపూర్ గ్రామాలకు చెందిన నిరుపేదలైన బాలమణి, వెంకటయ్య, మహేందర్‌ల నూతన ఇంటి నిర్మాణాలకు శనివారం ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్, జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్.. ట్రస్టు సభ్యులచే ఇసుక, స్టీల్, ఇటుక, సిమెంట్ తదితర మెటీరియల్‌ను అందజేశారు. నియోజకవర్గంలోని నిరుపేదలకు అండగా ఉంటామన్నారు. ఎంపీటీసీలు రమేష్, సునీత, దర్శన్‌రెడ్డి, సర్పంచ్ రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ మోహన్‌రెడ్డి, జానయ్య, నర్సింహ, శ్రీను పాల్గొన్నారు.

పంచాయతీ కార్మికురాలికి..

కడ్తాల్: కడ్తాల్ గ్రామ పంచాయతీలో పారిశుధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న మాసనోళ్ల మణెమ్మ కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. బాధితురాలిని శనివారం గ్రామ సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి పరామర్శించారు. వైద్య ఖర్చుల నిమిత్తం మణెమ్మకు, రూ.5 వేలు ఆర్థికసాయం అందించారు.వార్డు సభ్యులు మల్లయ్య, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

మృతుడి కుటుంబానికి..

తలకొండపల్లి: మండలంలోని వెల్జాల్‌కు చెందిన ఆయిల్ లక్ష్మీనారాయణగౌడ్ ఇటీవల మృతి చెందాడు. శనివారం బీజేపీ మండలాధ్యక్షుడు రవిగౌడ్ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీజేపీ నేత తల్లోజు ఆచారి పిలుపు మేరకు రవిగౌడ్ బాధిత కుటుంబ సభ్యులకు రూ.2500 ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు శేఖర్‌రెడ్డి, రంగారెడ్డి, కార్యదర్శి సుదర్శన్, శ్రీశైలంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కులసంఘాల అభివృద్ధికి కృషి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న అనంతరెడ్డి

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

ఆమనగల్లు: కల్లుగీత కార్మికుల, గౌరెల కాపరుల భవనాల నిర్మాణానికి రూ.20 లక్షలు నిధులు మంజూరైనట్లు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తెలిపారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే నివాసంలో శనివారం నిధుల ప్రొసీడింగ్ కాపీలను ఆమనగల్లు మున్సిపల్ బీఆర్ఎస్ నాయకులు నిరంజన్‌గౌడ్, కృష్ణయాదవ్‌కు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందజేశారు. మంగళపల్లి గేటు దగ్గర విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని, మంగళపల్లి నుంచి చెన్నారం గ్రామానికి రోడ్డు, బ్రిడ్జి నిర్మించాలని కోరుతూ ఆమనగల్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు వినతిపత్రం అందజేశారు. మంగళపల్లి నుంచి చెన్నారం రోడ్డులో బ్రిడ్జి లేకపోవడంతో వర్షం వచ్చినప్పుడు వాగు ప్రవహించి రాకపోకలు నిలిచిపోతున్నాయని, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ.. చెన్నారం రోడ్డు, బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి నిధుల మంజూరుకు కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కులసంఘాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఆమనగల్లు సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు ఎల్ఎన్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి శంకర్, నాయకులు వెంకటయ్య, సాయికుమార్, మురళి, శ్రీశైలంయాదవ్, తానయ్య, యాదయ్య, శివ, బాలస్వామి, వినోద్ పాల్గొన్నారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయాలి



కడ్తాల్: జేపీఎస్‌ల సమ్మెలో మాట్లాడుతున్న శివ

టీపీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివ

కడ్తాల్: ప్రొబేషనరీ కాలం పూర్తయిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులను, వెంటనే రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శివ డిమాండ్ చేశారు. జేపీఎస్‌లను రెగ్యూలరైజ్ చేయాలని మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చేపట్టిన సమ్మె శనివారానికి రెండోరోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా సమ్మెను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ.. జేపీఎస్‌ల నియామకం జరిగి 4 సంవత్సరాలు పూర్తి కావడం జరిగిందని ఇంతవరకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ భద్రత లేకపోవడంతో జూనియర్, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు పడుతున్నారని వారిని వెంటనే రెగ్యులరైజ్ చేయాలని కోరారు. డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు.

మల్లు రవి సంఘీభావం..

మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మెకు పీసీసీ ఉపాధ్యక్షుడు డాక్టర్ మల్లురవి స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి సంఘీభావం తెలిపారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ రాములుగౌడ్, విటలయ్యగౌడ్, టీ పీఎస్ఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జావీద్, జేపీఎస్ సంఘం మండల అధ్యక్షుడు రమేశ్, రాజు, మహేశ్, రాఘవేందర్, రాణి, అశ్విని, రమాదేవి, హరీశ్, ప్రశాంత్, లింగారెడ్డి, రాఘవేందర్, ప్రసాద్, జగన్, జంగయ్య, రాజశేఖర్, రాఘవేందర్ పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలు పరిష్కరించండి

వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అర్జున్‌రెడ్డి

కడ్తాల్: వీఓఏల డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన సమ్మె శనివారానికి 12వ రోజుకు చేరుకుంది. సమ్మెకు వైఎస్సార్‌టీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చీమర్ల అర్జున్‌రెడ్డితో పాటు, పార్టీ మండల అధ్యక్షుడు నరేశ్, నాయకులు శ్రీను, రమేశ్, కృష్ణ సంఘీభావం తెలిపారు. అదేవిధంగా మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీ రాములు, ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డిని వీఓఏలు కలిసి తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, వైస్ ఎంపీపీ ఆనంద్, సర్పంచ్ లక్ష్మీనర్సింహారెడ్డి, ఎంపీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, లచ్చిరామ్ నాయక్, జహంగీర్‌బాబా, రాములుగౌడ్, వీఓఏల సంఘం మండల అధ్యక్షుడు జానకీరాములు కార్యదర్శి వనిత, కోశాధికారి జంగయ్య ఉన్నారు.



కడ్తాల్: సమ్మెకు మద్దతుగా మాట్లాడుతున్న అర్జున్‌రెడ్డి

ఎమ్మెల్సీ పరామర్శ

కడ్తాల్: మండల పరిధిలోని మర్రిపల్లి గ్రామానికి చెందిన వెంకటమ్మ, ఆమె కుమారుడు తిరుపతి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. బాధితులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రితో చికిత్స పొందుతున్నారు. బాధితులను శనివారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ వేర్వేరుగా పరామర్శించారు. వైద్యులను అడిగి వారి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5వేలు సాయం అందించారు. పరామర్శించిన వారిలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్ గుప్త, నాయకులు జంగయ్యగౌడ్ ఉన్నారు.

యువ సమ్మేళనానికి తరలిరండి: బీఆర్ఎస్వీ

ఇబ్రహీంపట్నం రూరల్: మే 9వ తేదీన ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో జరగబోయే యువ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షుడు జగదీశ్వర్ కోరారు. శనివారం మండలంలోని తులేకలాన్‌లో బీఆర్ఎస్వీ నేతలు జగదీశ్వర్, భగీరథ సాగర్‌తో కలసి ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం అభివృద్ధికి ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. ఎంకేఆర్ ఫౌండేషన్ పేరుతో అనేకమందికి ఉపాధి అవకాశాలు కల్పించిన ఘనత కిషన్‌రెడ్డికే దక్కిందన్నారు. అలాగే యువనాయకుడు ప్రశాంత్‌రెడ్డి నాయకత్వంలో ముందుకు సాగుదామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు.. భాష, సిద్దార్థ, జగదీశ్, మహేష్, నగేష్, శివకుమార్, అఖిల్, నిఖిల్, నాని, రాజు, శికుమార్ పాల్గొన్నారు.

అవినీతి ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టండి

తహసీల్దార్‌కు బీజేపీ నేతల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుర్కయంజాల్: దళితబంధు లబ్దిదారుల నుంచి లంచం తీసుకుంటున్న ఎమ్మెల్యేలు, వారి అనుచరులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం వారు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ వెంకటాచారిని కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ వనపర్తి జిల్లా ప్రభారీ ప్రతాప్, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు రమేష్ మాట్లాడుతూ.. అవినీతి ఎమ్మెల్యేల చిట్టా తనవద్ద ఉందన్న సీఎం కేసీఆర్ వారి పేర్లను బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు తూళ్ల నర్సింహగౌడ్, నాయకులు రమేశ్, శివ, రాజు, శేఖర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేదపాఠశాల వార్షికోత్సవం

కందుకూరు: మండల పరిధిలోని చిప్పలపల్లి సమీపంలోని విద్యారణ్యమ్ వేద పాఠశాల ఐదో వార్షికోత్సవాన్ని శనివారం నిర్వాహకుడు శశిభూషణ్‌శర్మ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో విద్యార్థులు తాము నేర్చుకున్న విద్యను, కళలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. వక్తలు రచయిత ఖండవల్లి సత్యదేవ్‌ప్రసాద్, సంస్కృత అకాడమీ ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ కె.నీలకంఠం ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

మోదీ సర్కార్‌ను గద్దె దింపాలి



ఇబ్రహీంపట్నం: నిరసన తెలుపుతున్న సీపీఐ నేతలు

ఇబ్రహీంపట్నం: ఇంటింటికి సీపీఐ బస్సుయాత్ర ఇబ్రహీంపట్నంలో శనివారం ఆ పార్టీ డివిజన్ సమితి ఆధ్వర్యంలో ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆపార్టీ రాష్ట్ర సమితి నాయకులు కావలి నర్సింహ మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ప్రధాని మోదీని గద్దె దించాలన్నారు. ప్రధాని మోదీ పాలనలో ప్రజా సంక్షేమం గాడితప్పిందన్నారు. రాష్ట్ర విభజన హామీలను పక్కకు పెట్టిందన్నారు. నిత్యావసర ధరలు పెరిగాయన్నారు. పెట్రో, డీజిల్, వంటగ్యాస్ ధరలు మండిపోతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు నీలమ్మ, చంద్రకళ, సీపీఐ నాయకులు లక్ష్మయ్య, శ్రీశైలం, నర్సింహ, విజయ్‌కుమార్, యాదగిరి, కిషన్, సూర్యం, మాధవి, ప్రచండ పాల్గొన్నారు.

కేంద్రానివి ప్రజావ్యతిరేక విధానాలు..

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కావలి నర్సింహ ప్రజలకు పిలుపునిచ్చారు. ఇంటింటికి సీపీఐ కార్యక్రమంలో భాగంగా శనివారం ఇబ్రహీంపట్నం మండలంలోని కప్పపహాడ్, ఎల్మినేడు, కొంగరకలాన్, ఆదిబట్ల , బొంగ్లూర్ ప్రాంతాల్లో పర్యటించారు. మతోన్మాద సర్కార్‌ను గద్దెదించే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నాయకులు నీలమ్మ, శ్రీశైలం, చంద్రకళ, బండ నర్సింహ, విజయ్‌కుమార్, లక్ష్మయ్య, కిషన్, సూర్యం, కృష్ణ, మాధవి, ప్రచండ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

మంచాల: అంగన్‌వాడీ కేంద్రాలు అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శాంతిశ్రీ అన్నారు. మంచాల మండల పరిధిలోని ఆరుట్ల అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ప్రీస్కూల్ పిల్లలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 3 సంవత్సరాలలోపు పిల్లలకు ఉచితంగా అక్షరమాల నేర్పించడమే గాకుండా పౌష్టికాహారం అందించడం జరుగుతుందన్నారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు కల్పన, టీచర్లు జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

మేడే వేడుకలకు తరలిరండి

సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహ

యాచారం: మేడే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దామని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీపీఎం పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన వివిధ ప్రజా సంఘాల బాధ్యులు, కార్మిక సంఘాల శ్రేణులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మే 1న అన్ని గ్రామాల్లో జెండావిష్కరణలు చేసిన అనంతరం మండల కేంద్రంలోని జెండావిష్కరణకు విచ్చేయాలని పిలుపునిచ్చారు. జెండావిష్కరణ అనంతరం మండల కేంద్రంలో ర్యాలీ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల బాధ్యులు బి.మధుసూదన్‌రెడ్డి, పి.అంజయ్య, ఆలంపల్లి జంగయ్య, వెంకటయ్య, మల్లేష్, జగన్, లాజర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లలితక్క జయంతి

ఇబ్రహీంపట్నం: వీరవనిత, గానకోకిల బెల్లి లలితక్క జయంతిని శనివారం ఇబ్రహీంపట్నంలో ఘనంగా నిర్వహించారు. యాదవ్ సంఘం నేతలు అమరవీరుల స్థూపం వద్ద ఆమె చిత్రపటాన్ని పెట్టి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు బర్ల జగదీశ్‌యాదవ్, రాష్ట్ర నాయకులు కసరమోని మల్లేష్ మాట్లాడుతూ.. మలిదశ తెలంగాణ ఉద్యమంలో తన గానంతో ప్రత్యేక రాష్ట్ర నినాదాన్ని లేవనెత్తి ప్రజలను చైతన్యం చేసిన లలితక్క సేవలు చిరస్మరణీయమన్నారు. అధికారికంగా లలితక్క జయంతి వేడుకలను జరపాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు శ్రీరాం, బాల్‌రాజ్, కృష్ణ, శ్రీశైలం, ఐలయ్య, వెంకటేశ్, శ్రీకాంత్, రజనీకాంత్ పాల్గొన్నారు.



లలితక్క చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న యాదవ సంఘం నేతలు